క్లుప్తంగా

బుక్‌నూక్‌కు 50 పుస్తకాలు అందజేత



పుస్తకాలను అందజేస్తున్న రాజేంద్రప్రసాద్ దంపతులు

ఏలూరు (టూటౌన్) : ఏలూరు, అశోకనగర్, ఫ్లై ఓవర్ పక్కనే ఉన్న నగరపాలక సంస్థకు చెందిన నమస్తే పార్కులో ఎస్పీ పి.ప్రతాప్ శివ కిషోర్ ఏర్పాటుచేసిన బుక్ నూక్ (పుస్తకాల గూడు)కు మున్సిపల్ రిటైర్డ్ రీజినల్ డైరెక్టర్, అడ్వొకేట్ డాక్టర్ వి.రాజేంద్రప్రసాద్, వెజ్లీనా దంపతులు శుక్రవారం రూ.7 వేలు విలువైన చరిత్ర, చట్టం, కవిత్వం, ఆధ్యాత్మికం, కార్టూన్లు, ఆరోగ్యం, సైన్స్, జీవిత చరిత్రలు, జనరల్ నాలెడ్జ్ తదితర 50 పుస్తకాలను బహూకరించారు. తమ వద్ద ఉన్న పుస్తకాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో బుక్ నూక్‌లో ఉంచుతున్నట్టు చెప్పారు.

గంగానమ్మ సేవలో సినీ నటుడు మురళీమోహన్



నటుడు మురళీమోహన్‌ను కలసిన భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రముఖ సినీ నటుడు మాగంటి మురళీ మోహన్ స్థానిక తూర్పువీధిలోని గాంగానమ్మ ఆలయానికి శుక్రవారం విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. త్వరలో ప్రారంభంకానున్న గంగానమ్మ జాతర సందర్భంగా ఈనెల 31న అమ్మవార్లకు ముడుపు కట్టడం, పందిరి రాటవేసే ఏర్పాట్లపై మురళీ మోహన్ ఆలయ కమిటీ నిర్వాహకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధి వంకినేని భానుప్రకాష్ మాట్లాడుతూ గతం కన్నా మరింత వైభవంగా అమ్మవారి జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అమ్మవార్ల దర్శనానికి విచ్చేసే లక్షలాది మంది భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపడతామని తెలిపారు.

నేత్రవైద్య పరికరాలపై అవగాహన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నేత్ర వైద్యానికి వినియోగించే పరికరాలపై సీఆర్‌ఆర్ మహిళా కళాశాల విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కల్పించారు. నేత్ర వైద్య నిపుణురాలు గుడిసేవ హేమలత మాట్లాడుతూ కెరటో మీటర్ ద్వారా చూపులో తేడాలు, కార్నియా రుగ్మతలు, కేటరాక్ట్, లాసిక్ సర్జరీ వంటివి, ఆప్తల్మోస్కోప్ ద్వారా కంటి రెటీనా, కంటి నరంలో తేడాలు, గ్లుకోమా వంటి వాటిని తెలుసుకోవడానికి ఉపయోగిస్తారని వివరించారు.

అధ్వానంగా ఏఎస్సార్ స్టేడియం

- పిచ్చిమొక్కలు, గడ్డితో అసౌకర్యం
- పట్టించుకోని క్రీడాధికారులు
- క్రీడాభిమానుల ఆగ్రహం



గడ్డి, పిచ్చిమొక్కల మధ్య వాకింగ్ చేస్తున్న వాకర్స్



బాస్కెట్‌బాల్ కోర్టు చుట్టూ పెరిగిన గడ్డి

ఏలూరు రూరల్ : ఏలూరు జిల్లా క్రీడల ప్రధాన కేంద్రం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం దుస్థితి అధ్వానంగా మారింది. స్టేడియంలో మౌలిక వసతులు కల్పనను పట్టించుకునే నాథుడు కరువయ్యారు. వర్షాకాలంలో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు, గడ్డి తొలిగించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో జిల్లా క్రీడ ప్రాధికార సంస్థ అధికారులు పనితీరుపై క్రీడాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాములు, విష పురుగుల భయం

ఇటీవల కురిసిన వర్షాలకు స్టేడియంలో పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి పాములు, విష పురుగులు, దోమల పెరిగిపోయాయి. బాస్కెట్‌బాల్, హాకీ కోర్టులతో పాటు గ్యాలరీ పక్క అడుగు ఎత్తున గడ్డి పెరిగిపోయింది. స్టేడియంలో అడుగు పెడితే చాలు దోమలు దండయాత్ర చేస్తున్నాయి. ఆటలు ఆడుతున్న బాలబాలికలతో పాటు వాకర్స్ సైతం దోమల కుట్టి తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షాలు పడడడంతో రన్నింగ్ ట్రాక్ చిత్తడిగా మారింది. దీంతో వాకర్లు గ్యాలరీ పక్క నుంచి పిచ్చిమొక్కలు, ఏపుగా పెరిగిపోయిన పచ్చగడ్డిపై నుంచి నడుస్తున్నారు. గడ్డి, పొదల మాటు నుంచి ఏ పాము వస్తుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షణ లేదు



కొద్ది నెలలుగా స్టేడియంలో పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగిపోయాయి. వాకర్స్ భయం, భయంగా సాధన చేస్తున్నారు. కొందరు వాకర్స్ సాధన చేయడం మానేశారు. గడ్డి, పొదల్లోకి బాల్ వెళితే తీసుకునేందుకు పిల్లలు కూడా భయపడుతున్నారు. సమస్యను అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా తాత్కాలికంగా పరిష్కరించి చేతులు దులుపుకుంటున్నారు. ఇక గత్యంతరం లేక అసోసియేషన్ ఆధ్వర్యంలో మేమే గడ్డి మందు చల్లించాం.

– గొంతిన రామకృష్ణ, వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు

గ్రౌండ్స్‌మెన్‌ను నియమించాలి



స్టేడియంకు ఒక్క గ్రౌండ్ మెన్ కూడా లేడు. ఏళ్లు గడుస్తున్నా గ్రౌండ్స్‌మెన్ నియామకం చేపట్టలేదు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థకు షాపుల ద్వారా కొంత ఆదాయం వస్తుంది. ఈ ఆదాయం ఉపయోగించి కనీసం అవుట్ సోర్సింగ్ విధానంలోనైనా గ్రౌండ్స్‌మెన్ నియమించాలి. గడ్డి చెక్కించి, పిచ్చిమొక్కలు తొలిగించే పనులు చేపట్టాలి. అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ఎస్ సత్యనారాయణ, సీనియర్ క్రీడాకారుడు

భద్రత, చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులకు చదువులో రాణించడానికి దృష్టి, క్రమశిక్షణ ఎంత ముఖ్యమో, భద్రత, చట్టాలపై అవగాహన కూడా అంతే ముఖ్యమని అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్యచంద్రరావు సూచించారు. ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు, స్థానిక ఎస్ఆర్ఐ కాలేజీలో విద్యార్థినుల కోసం శక్తి యాప్ మహిళా భద్రతపై ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూర్యచంద్రరావు మాట్లాడుతూ శక్తి యాప్ మహిళల భద్రత కోసం ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ రూపొందించిన ఎమర్జెన్సీ రెస్పాన్స్ మొబైల్ అప్లికేషన్ అని, ఇది అత్యవసర పరిస్థితుల్లో తక్షణ పోలీస్ సహాయం అందిస్తుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో యాప్ ద్వారా లేదా డయల్ 112కు సమాచారం ఇస్తే సమీప గస్తీ బృందం వెంటనే చేరుకుని రక్షణ కల్పిస్తుందని వివరించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై నాగమణి గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశంపై ప్రత్యేక చైతన్య కార్యక్రమం నిర్వహించి, మహిళా రక్షణ చట్టాలపై వివరించారు.

జేసీని కలసిన ఎన్‌జీవోస్ నాయకులు



జేసీ అభిషేక్ గౌడకు మొక్కను అందజేస్తున్న నాయకులు



జేసీకి మొక్కను అందిస్తున్న రెవెన్యూ అధికారులు

ఏలూరు(మెట్రో): ఇటీవల జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న అభిషేక్ గౌడను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీఎన్‌జీవోస్ నాయకులు శుక్రవారం ఏలూరు కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ని శాలువాతో సత్కరించి పూల మొక్కను అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎన్జీవో సంఘ నాయకులని జేసీ కోరారు. జేసీని కలిసిన వారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు వెంకట రామారావు, తాలుకా నాయకులు, మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

జేసీని కలిసిన గ్రామ రెవెన్యూ అధికారులు

జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిషేక్ గౌడను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు, ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీ నారాయణ, ఏలూరు జిల్లా అధ్యక్షులు కాయల వెంకటేశ్వరరావులు మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్–1 వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్‌లుగా ప్రమోషన్లు, గ్రేడ్ 2 వీఆర్వోలకు గ్రేడ్–1 ప్రమోషన్లు, గ్రేడ్–2 వీఆర్వోల ప్రొబిషన్ సమస్యలపై మాట్లాడి న్యాయం చేయాలని కోరారు. ఏలూరు జిల్లా కోశాధికారి రవికుమార్, పెదవేగి మండల వీఆర్వో నాయకులు శ్రీనివాస్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో హాక్ ఏపీ హ్యాకథాన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) స్థాపించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్, ఆంధ్రప్రదేశ్, క్లైమేట్ కలెక్టివ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యుత్ రంగంలో సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు హాక్ ఏపీ హ్యాకథాన్ నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఎస్ఈ పి.సాల్మన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఎదురవుతున్న సవాళ్లకు స్మార్ట్, డేటా ఆధారిత, ఆధునిక సాంకేతిక పరిష్కారాలు కనుగొనడం ఈ హ్యాకథాన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. హ్యాకథాన్‌లో పాల్గొనే స్టార్టప్ కంపెనీలు ఈ నెల 22వ తేదీ రాత్రి 12 గంటల వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని తెలిపారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం



రచ్చబండలో మాట్లాడుతున్న సంజీవ్‌కుమార్

దెందులూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయటం దుర్మార్గమని పార్టీ సీనియర్ నేత వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఏలూరు రూరల్ మండలం పాలగూడెం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సూచన మేరకు పార్టీ ఏలూరు రూరల్ మండలం అధ్యక్షులు తేరా ఆనంద్ అధ్యక్షతన గ్రామ సర్పంచ్ పత్యాల సునీత ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవ్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యాపార దృక్పథంతో విద్య వైద్యాన్ని ప్రైవేటీకరణకు పూనుకుందని ఆరోపించారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రభుత్వంపై వ్యతిరేకత

తేరా ఆనంద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. నిరుద్యోగులకు భృతి ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. మహిళలకు సైతం ఇచ్చిన హామీని అమలు చేయలేదని తెలిపారు. పేదలందరికీ విద్య, వైద్యం సకాలంలో అందేలా చర్యలు తీసుకోకపోతే ఉద్యమం ప్రారంభమవుతుందని అన్నారు. అనంతరం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీత, గ్రామ పార్టీ అధ్యక్షులు బత్తుల అప్పారావు, ఎంపీటీసీ బొమ్మవరపు గోకనీసు, పార్టీ అధ్యక్షులు సింగవరపు సూరిబాబు, ఉప సర్పంచ్ తోతా నిరంజన్, విద్యార్థి విభాగం అధ్యక్షులు బొమ్మవరపు సురేంద్ర, నాయకులు అశోక్, గెడ్డం అరుణ్, రుంజల రమేష్, నరేంద్ర, వెంకట్రావు, బెజవాడ రామారావు, ముంగర అంతర్వేది, వార్డు మెంబర్లు గొర్రెల హేమలత, కడలి నాగలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ పెట్టాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్య

దెందులూరు: వ్యక్తిగత, సామూహిక ఆరోగ్య పరిరక్షణకు బాలికలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఐసీడీఎస్ ఏలూరు రూరల్ సెక్టార్ సూపర్‌వైజర్ సత్య సూచించారు. శుక్రవారం ఏలూరు సీడీపీఓ పద్మావతి సూచన మేరకు మాదేపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్ఎంఎస్ వెంకటలక్ష్మి అధ్యక్షతన అంతర్జాతీయ బాలిక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బాలికలకు అవగాహన సమావేశం నిర్వహించారు. సత్య మాట్లాడుతూ రక్తహీనత రాకుండా పోషకాహార పదార్థాలు సరైన నిద్ర, వ్యాయామం చేయాలన్నారు. బాలికలకు 18 ఏళ్లు నిండితేనే తల్లిదండ్రులు వివాహం చేయాలని అన్నారు. మానవ అక్రమ రవాణా పై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఐసీడీఎస్ సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీఎంఎస్ కె.భువనేశ్వరి, సుజాత, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు విద్యార్థులు ఉన్నారు.

భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తున్న కూటమి సర్కార్

ఏలూరు (టూటౌన్): రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 1(ఎ) ప్రకారం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను రాష్ట్రంలోని కూటమి పాలకులు హరిస్తున్నారంటూ పలువురు వక్తలు మండి పడ్డారు. సాక్షిపై కూటమి ప్రభుత్వం కుట్రలను నిరసిస్తూ జర్నలిస్టు సంఘాలు,ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పత్రికా స్వేచ్ఛను కాపాడాలంటూ, మీడియాపై దాడులను అరికట్టాలని, జర్నలిస్టులపై వేధింపులను ఆపాలని, సిగ్గు.. సిగ్గు పత్రికలపై దాడులు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ), వైఎస్సార్‌సీపీ నాయకులు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్ బాబు,నెరుసు చిరంజీవి, కిలాడి దుర్గారావు, తుమరాడ స్రవంతి, జిజ్జువరపు విజయనిర్మల, దాసరి రమేష్,పల్లి శ్రీను, మేతర సురేష్, పిట్ట ధనుంజయ్, కొవ్వాడ దుర్గారావు, మట్ట రాజు, జెవిఆర్ మాస్టర్, అనుపర్తి శ్యామ్, స్టాలిన్ బాబు, బి.బాచి, లక్కబత్తుల ఏసుపాదం, పిల్లంగోళ్ల సత్యదేవ్, ఎచ్చెర్ల ఉమా మహేష్, ఉయ్యాల గణేష్, డి.మధు,డాలి వెంకటేష్, అగ్గాల కృష్ణ, ఇనపనూరి జగదీష్ పెద్ద సంఖ్యలో ఆయా పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నేడు ధర్నా



సుంకరవారి తోటలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలోని 11, 30వ డివిజన్లలో వర్క్ అవుట్ సోర్సింగ్ పేరుతో అమలు చేస్తున్న ప్రైవేటీకరణ విధానాన్ని వ్యతిరేకిస్తూ శనివారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ ఆఫీసు వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి అంగులూరీ జానుబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు సుంకర వారి తోట తూర్పు వీధి వంకాయ గూడెం పడమర వీధి సర్కిళ్లలో ప్రచారం నిర్వహించారు. ప్రైవేటీకరణ నిలిపివేయాలని, ఆప్కాస్ ద్వారా నియామకాలను చేపట్టాలని, ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని జానుబాబు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీఎన్‌వీడీ ప్రసాద్, ఎం ఇస్సాకు, జె.గోపి, పి.రవికుమార్, బండి రాజు తదితరులు పాల్గొన్నారు.

రవ్వలకొండను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

ఏలూరు (టూటౌన్): శ్రీమద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నడయాడిన కడప, కర్నూలు జిల్లాల్లోని చారిత్రక ప్రదేశాలను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, యోగా రీసెర్చ్ సెంటరు ఏర్పాటు చేయాలని, రవ్వలకొండ వద్ద 100 అడుగుల వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహం నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం కోరింది. ధర్మపీఠం ప్రధాన సంచాలకులు అప్పల భక్తుల శివకేశవరావు (శివ శ్రీ) ఈ అంశంపై ప్రధాని మోదీకి లేఖరాశారు. ఆ వివరాలను శుక్రవారం ఆయన పత్రికలకు విడుదల చేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	46	బిళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	36
బెండకాయలు	32	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	36	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	48
బీరకాయలు	28	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	38	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70–90
క్యారెట్	54	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	30	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	10
గోరుచిక్కుడు	44	గోంగూర	07–10
దోసకాయలు	28	పుదీనా	05
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

పత్రికా స్వేచ్ఛపై దాడి హేయం



అందుగుల ఫ్రాన్సిస్

బుట్టాయగూడెం: ప్రభుత్వాలు పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడం దారుణమని మాజీ ఎంపీటీసీ సభ్యులు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకలాపాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసే ప్రింట్ అంట్ ఎలక్ట్రానిక్ మీడియాలను విచారణ పేరుతో వేధించడం ప్రతికా స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని అన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపిస్తున్నారనే కక్షతో సాక్షిపై కక్ష కట్టడం సరికాదని చెప్పారు. ఇందుకు సంబంధించి ఎడిటర్, పాత్రికేయులకు నోటీసులు ఇచ్చి బెదిరించడం , కేసులు బనాయించడం సబబు కాదన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛను హరించే విధానాలకు తక్షణమే స్వస్తి పలకాలన్నారు.

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

ఏలూరు(మెట్రో): చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కలెక్టరు కె.వెట్రి సెల్వి కోరారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం జిల్లాలో నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు శానిటేషన్ పై సంబంధిత అధికారులతో కలెక్టరు సమావేశం నిర్వహించారు. శానిటేషన్ ప్రగతిని సమీక్షిస్తూ, లోటు ఉన్న మండలాలు అధికారులుపై కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. శానిటేషన్ మెరుగు పరచకపోతే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా పంచాయతీ శాఖ అధికారి కె.అనురాధ, జెడ్పీ సీఈఓ ఎం శ్రీహరి, నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భాను ప్రతాప్, డీఆర్డీఏ పీడీ ఆర్ విజయరాజు, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ అధికారి జి.త్రినాథబాబు, డ్వామా పీడీ కేవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	22
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	14
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	22
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	28
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	22
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు – తిరుపతి	16.00	4830	31

ప్రైవేటీకరణతో పేదలకు వైద్య విద్య దూరం

కుక్కునూరు, గవరవరంలో కోటి సంతకాల సేకరణ



కుక్కునూరు : సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కుక్కునూరు: పేద విద్యార్థులకు వైద్య విద్యను దూ రం చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తాండ్ర రాజేష్ విమర్శించారు. శుక్రవారం పార్టీ కుక్కునూరు కార్యాలయంలో రచ్చబండ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. రాజేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో వైద్య వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. అందుకే కూటమి ప్రభుత్వానికి కోటి సంతకాల ద్వారా బుద్ధిచెప్పడానికి జగన్‌మోహన్‌రెడ్డి రచ్చబండ కార్యక్రమాన్ని చేపట్టారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని అటకెక్కించిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ గాడిద రామచంద్రం, నాయకులు కుచ్చర్లపాటి చిన్న నరసింహరాజు, మల్లెల చంటినాయుడు, వేల్పుల శ్రీను, బాసిబోయిన సంతోష్, తాండ్ర సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమం తప్పదు

కొయ్యలగూడెం: కూటమి ప్రభుత్వం వైద్య విద్యపై అనుసరిస్తున్న విధానం పేదవర్గాల విద్యార్థులకు ఆశనిపాతంగా మారబోతోందని, దీంతో ప్రజా ఉద్యమం తప్పదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కో కన్వీనర్ బిరుదు గడ్డ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో గవరవరంలో శుక్రవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో వైద్య విద్యను పేద వర్గాల వారికి చేరువ చేయగా కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ధనిక వర్గాలకే పరిమితం చేయనుందని ఆరోపించారు. దీంతో 108, 104, ఆరోగ్యశ్రీ అర్హులకు దూరం కానున్నాయని తెలిపారు. కోట్లాది మంది ప్రజల జీవితాల్లో వెలుగు నింపిన వైద్య ఆరోగ్య పథకాలు నిర్వీర్యం కానున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంజిమాల రామారావు, పలివెల దుర్గారావు, రవి కిరణ్, బి.అఖిల్ జాన్, చీమకుర్తి సత్తిబాబు, బొమ్మ శ్రీను, వేముల సత్యనారాయణ, పలివెల వరదయ్య, వెంకటపతి, దూలపల్లి కాంతారావు, ఎస్కే బాజీ, సీహెచ్ రవి, గాబ్రియేలు, కె.బుజ్జిబాబు, తదితరులు పాల్గొన్నారు.